# ప్రభావతి

భరద్వాజ మహర్షి ఆశ్రమం ఎప్పుడూ వేదఘోషతో విలసిల్లుతూ ఉంటుంది. ఆశ్రమవాసులు ఎప్పుడూ దైవ సంబంధమైన కార్యక్రమాలలో నిమగ్నులై ఉంటారు. భరద్వాజ మహర్షి నిత్యానుష్ఠానం మాత్రమే కాక, లోక కళ్యాణార్థం యజ్ఞయాగాదులూ నిర్వర్తిస్తుండేవాడు.

భరద్వాజ మహర్షి కుమార్తె ప్రభావతి, తండ్రి జరిపే కార్యక్రమాలు ఎంతో శ్రద్ధతో తిలకించేది. అనేక క్రతువులలో దేవేంద్రుని ఆవాహనం చేయటం ఆమెకు ఎంతో ఆసక్తికరంగా ఉండేది. దేవేంద్రుని బలపరాక్రమాల గురించి, దేవేంద్ర వైభవం గురించి, స్వర్గలోకపు సౌందర్యం గురించి అందరూ చెప్పుకుంటుంటే చాలా ఉత్సాహంగా వినేది ప్రభావతి. స్వర్గాధిపత్య విశేషాలు వింటుంటే ఆశ్చర్యంతో ఆమె శరీరం గగుర్పాటు చెందేది.

ఇంద్రుడు దుష్టశక్తుల నణిచివేస్తూ, లోకశ్రేయస్సును వేయికళ్ళతో కాపాడుకొస్తున్నాడని విన్న ప్రభావతి మనసు ఆనందడోలికల్లో తేలిపోయేది. అలాటి దేవేంద్రునికి అన్ని దైవ కార్యాలలోను ప్రముఖమైన స్థానం ఉండటం సహజమేనని ఆమె తృప్తిగా అనుకొంది.

దేవేంద్రుని గురించిన ఆలోచనలు ఆమె మనసును చుట్టుముడుతుంటే ఆయనపట్ల భక్తి గౌరవాలు పెరిగాయి ప్రభావతికి. అనుక్షణం ఇంద్రుని స్మరించటం ఆమెకు అలవాటైపోయింది.

వసంతం వచ్చి వెళ్ళింది. నూత్నయౌవనం నింపుకున్న ప్రభావతి సహజ సౌందర్యం మరింత అతిశయించింది. అందరి చూపులు ఆమెపైనే నిలుస్తున్నాయి. ఆమెకు వివాహ యోగ్యమైన వయసు వచ్చిందని ఆశ్రమ స్త్రీలు భరద్వాజునికి తెలియపరిచారు.

వివాహ ప్రయత్నాలకి సమయ మాసన్నమైందని గుర్తించిన భరద్వాజ మహర్షి, ప్రభావతి మనోభిప్రాయం తెలుసుకోవటం ధర్మమని తలంచాడు.

ఆనాడు అగ్నికార్యం నిర్వర్తించి, బయట నిలిచాడు భరద్వాజుడు. పొన్నచెట్టుకింద నిలబడి, వినీలాకాశాన్ని చూస్తున్న ప్రభావతి కనిపించిం దాయన కళ్ళకి. అదే శుభసమయమనిపించి, కుమార్తెను దగ్గరకు పిలిచాడు.

"నీ వయోధర్మాన్ననుసరించి నీకు వివాహం జరిపించాల్సిన బాధ్యత నాపై ఉంది. ఎందరో మునికుమారులు వివిధ క్రతువుల్లో పాల్గొనేటందుకు నా దగ్గరకు రావటం నీవూ చూస్తున్నావు. వారిలో ఎందరో నిన్ను చేపట్టడానికి ఇష్టపడవచ్చు, కానీ నీ మనోభిప్రాయం తెల్సుకుని..." భరద్వాజుడు కుమార్తె వంక చూశాడు.

ప్రభావతికి ముఖం వివర్ణమవటం మహర్షికి ఆశ్చర్యాన్ని కలిగించింది వివాహమంటే ఆమెకు విముఖతా, లేక ఆమె మనసులో మరో భావ ముందా అని వితర్కించుకుంటూ-"అమ్మా, నీకు ఇప్పుడే వివాహం చేసుకోవాలని ఇష్టం లేదా?" లాలనగా అన్నాడు భరద్వాజుడు.

నీళ్ళు నిండిన ప్రభావతి కళ్ళను గమనిస్తూనే ఉన్నాడు. వివాహంపట్ల విముఖత లేదన్నట్లు తల అడ్డంగా తిప్పింది ప్రభావతి. మహర్షి మనసు తేలిక పడింది. ఆమె మనసులో భావం మాత్రం గ్రహించలేకపోయాడు.

నీళ్ళు నిండిన కళ్ళు ఎత్తి తండ్రి వంక చూసింది ప్రభావతి. తండ్రితో అసత్యం చెప్పలేదు. అనితర సాధ్యమైన వెన్నో సాధ్యం చేయగల మహర్షి తన తండ్రి. తన మనోభీష్టం తెలియపరిస్తే అది నెరవేర్చే శక్తి తన తండ్రికి ఉందని ఆమెకు తెలుసు.

"బాల్యం నుంచీ నా మనసు పరమపూజ్యుడు, స్వర్గాధిపతి అయిన దేవేంద్రునిపైనే లగ్నమయింది తండ్రీ! ఆయనను ఆరాధించటమే నా ధ్యేయం. దేవేంద్రునిపైన తప్ప మరొకరిపైన నా మనసు పోదు. నే నెవ్వరినీ వివాహ మాడలేను. నన్ను మన్నించండి."

కుమార్తె మాటలు విని సర్వజ్ఞానియైన భరద్వాజమహర్షి నివ్వెరపోయాడు. ప్రభావతి గుణగణాలు, ఏకాగ్రత, నిర్మలమైన మనసు మహర్షికి తెలియనివి కావు. కానీ, తన కుమార్తె తన ధ్యేయాన్ని సాధించగలదా? భరద్వాజుని మనసు చింతాక్రాంతమైంది.

"అమ్మా! ముల్లోకవాసులూ దేవేంద్రుని కరుణా కటాక్ష వీక్షణాలకోసం జీవితమంతా ఎదురు చూస్తుంటారు. మేమంతా నిరంతరం నిర్వహించే ఈ యజ్ఞ యాగాదులన్నీ స్వర్గాధిపతి ప్రసాదం కోసమేగా? అటువంటి దేవేంద్రుణ్ణి నువ్వు భర్తగా కోరుకుంటున్నావు. నీ కోరిక అసాధ్యమైందని నా మనసు కలవరపాటు చెందుతోంది తల్లీ!"

భరద్వాజుడు మాట ఆపి కుమార్తెవంక చూశాడు. ఆమె ముఖంలో ఎలాంటి చలనమూ కానరాలేదు మహర్షికి. ఆమె తన పట్టుదలని వీడదని ఆయనకి అర్థమైంది.

ప్రభావతి ఏకాగ్రతతో, నిశ్చలంగా తన ధ్యేయాన్ని నెరవేర్చుకోగల ఆత్మ విశ్వాసంతో తండ్రి వంక చూసింది.

మహర్షిలో వాత్సల్యం పెల్లుబికింది. కుమార్తె శిరసునిమిరి "విజయోస్తు!" అన్నాడు.

తండ్రి ఆశీర్వచన బలం తనకుందనే గొప్ప తృప్తితో ప్రభావతి కళ్ళు మెరిసాయి. ఎట్లాగైనా ఇంద్రుని వరించాలనే గొప్ప సంకల్పంతో, కఠోర తపో దీక్షకు ఉద్యుక్తురాలయింది ప్రభావతి.

నిరంతర తపోదీక్షలో ఉన్న ప్రభావతికి రోజులు తెలియడంలేదు. ఋతువులు కదిలిపోతున్నాయి. ఏకాగ్రత సడలటంలేదు.

ప్రభావతి తపోదీక్ష ఇంద్రుని దృష్టి నాకర్షించింది. భరద్వాజ మహర్షి కుమార్తె తనను భర్తగా కోరటం దేవేంద్రుని మనసును రంజింపచేసింది. ఆమెను దర్శించాలని అతని మనసు ఉవ్విళ్ళూరింది. అంతలోనే ఆమె ప్రేమను పరీక్షించాలనే కోరిక కలిగింది.

వశిష్ఠ మహర్షి వేషంలో ప్రభావతి తపోవాటికను ప్రవేశించాడు దేవేంద్రుడు.

లోకపూజితుడైన వశిష్ఠ మహర్షికి అర్ఘ్యపాద్యాదు లర్పించింది. వశిష్ఠుడు ప్రభావతిని నఖశిఖపర్యంతరమూ పరిశీలిస్తుంటే, అతని మనోభావం అంతు పట్టలేదు ప్రభావతికి.

తను ఏదైనా పొరబాటుచేసిందేమో అర్ఘ్యపాద్యాదులు అర్పించే సమయంలో అని వితర్కించుకుంటూ, తల వంచి నుంచుంది.

"నీ పాణిగ్రహణం అభిలషించి నేను..." వశిష్ఠ మహర్షి తర్వాతి మాటలు ఆమెకు వినిపించలేదు.

ఆ మాట ఆమెకు పిడుగుపాటులా తోచింది. భయంతో ఆమె శరీరం గజగజ వణికింది. గొంతు గాద్గదికమైంది. ఈ కోరిక తీర్చకపోతే మహర్షి తనను శపిస్తాడేమో? కాళ్ళకింద నేల కదిలిపోతున్నట్లయింది. ఎలాగో మనసుకి ధైర్యం చెప్పుకుంది. గొంతు సవరించుకుంది. కన్నీళ్ళు బయటపడకుండా గొంతులో దిగమింగుకుంది.

"నేను దేవేంద్రుని త్రికరణశుద్ధిగా కోరి తపస్సు చేస్తున్నాను. నా పాణి గ్రహణం జరిగితే స్వర్గాధిపతితోనే జరగాలి. తమరు అదితప్ప, మరేది కోరినా నేను శిరసావహిస్తాను." చేతులు జోడించింది ప్రభావతి.

వశిష్ఠుడు వెంటనే ఉత్తరీయంలోంచి బదరీఫలాలు తీశాడు. "సరే, నిన్నేమీ కోరనులే. ఈ రేగుపండ్లు ఉడికించి ఇయ్యి, చాలు."

ప్రభావతి మనసు తేలికపడింది. రేగుపండ్లు ఎంతలోకి ఉడుకుతాయి?

కట్టెలు భగభగ మండుతున్నాయి. రేగుపండ్లు ఉడకటంలేదు. మరిన్ని కట్టెలు చేర్చి మంట ఎగదోసింది. భగభగ మండుతున్నాయి. రేగుపండ్లు ఉడకడంలేదు.

కట్టెలు మండుతూనే ఉన్నాయి. అన్ని కట్టెలూ అయిపోతున్నాయి. రేగు పండ్లు మాత్రం ఉడకటం లేదు.

కట్టెలైపోయాయి.

ప్రభావతి ముఖాన పట్టిన స్వేదం తుడుచుకుంది. ఇక పక్వం కాకపోతే, అపక్వదోషం కలుగుతుంది.

వశిష్ఠుడు ఆమెనే శ్రద్ధగా చూస్తున్నాడు.

మంట పూర్తిగా చల్లారబోతోంది. కట్టెలకోసం ఆమె వెడితే, మంట పూర్తిగా చల్లారిపోతే? మంట ఆరకూడదు. ప్రభావతి అన్ని దిక్కులూ చూసింది. ఎక్కడా కట్టెల్లేవు.

మహర్షికి మాట ఇచ్చింది- రేగుపళ్ళు ఉడికించి ఇస్తానని. ఏం చెయ్యాలి?

ప్రభావతి తన వంక తాను చూసుకుంది... తపోదీక్షతో పాలిపోయిన చెక్కిళ్ళు, క్రుశించిన శరీరం. అప్రయత్నంగా ఆమె చూపులు కాళ్ళపైన నిల్చాయి. ఈ కాళ్ళే కట్టెలైతే, ఈ బదరీఫలాలు పక్వమవుతాయేమో!

దేవేంద్రుని స్మరించింది. తన కాళ్ళు కట్టెలుగా మంటలో పెట్టటానికి నిశ్చయించుకుంది ప్రభావతి.

ప్రభావతి ఏకాగ్రత, సచ్ఛీలత దేవేంద్రుని విస్మయపరుస్తుండే; నిజ రూపంతో ఆమె ముందు నిల్చాడు. "ప్రభావతీ! నాకోసం నువ్వు చేస్తున్న ఈ కఠోరతపస్సు ఇక చాలించు. ప్రేమ పరీక్షించడానికే ఈ వశిష్ఠుని రూపం. నీకు కొంత అవేదనను కూడా కలిగించాను."

కళ్ళనూ, చెవులనూ నమ్మలేకపోయింది ప్రభావతి. తన ధ్యేయం నెరవేరటమే కాక, తన ఎడల సద్భావం వ్యక్తం చేసిన దేవేంద్రుని దర్శించిన ప్రభావతి కళ్ళలో కాంతిరేఖలు భాసించాయి.

దేవేంద్రునితో స్వర్గానికి బయలుదేరిన కుమార్తె ప్రభావతిని చూస్తున్న మహర్షి భరద్వాజుని కళ్ళలో ఆనందబాష్పాలు నిల్చాయి.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం:
శల్యపర్వం : ద్వితీయాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 22-6-1988)